
# మెరిసిపోతున్న వంగర

- రూ.4.73 కోట్లతో అభివృద్ధి పనులు
- వీధి వీధినా సీసీ రోడ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 7 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర ప్రగతి బాటన పయనిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు సమైక్య పాలనలో వంగర గ్రామం అంధకారంలో మగ్గింది. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ వంగర గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. పీవీ నరసింహారావు జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రోత్సాహం, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ సహకారంతో వంగర గ్రామం అభివృద్ధి పనుల్లో దూసుకుపోతున్నదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.4.73కోట్ల వరకు గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని సర్పంచ్ ఆలూరి రజిత తెలిపారు. అలాగే, పీవీ పార్క్ కోసం చకాచకా పనులు సాగుతున్నాయి. పీవీ ఇంటిని అతడి కుటుంబసభ్యులు మ్యూజియంగా మార్చారు. పీవీ వినియోగించిన వస్తువులు, ఫొటోలను అందులో పదిలపరిచారు. గ్రామంలో ఎటుచూసినా సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. వీధివీధినా డ్రైనేజీ,



వంగర గ్రామం



గ్రామంలోని వీధుల్లో వేసిన సీసీ రోడ్డు


స్ట్రీట్ లైట్లు అమర్చుతున్నారు. గ్రామం నడిబొడ్డున సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ కూడా ఏర్పాటు కానుంది. గ్రామంలో నర్సరీ, వైకుంఠధామం, రైతు వేదిక, క్రీడాప్రాంగణం, డంపింగ్ యార్డు, కంపోస్ట్ షెడ్ తదితర సౌకర్యాలు కల్పించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశాన్ని ఎంపికచేసే పనుల్లో గ్రామపంచాయతీ పాలకవర్గం నిమగ్నమైంది. అలాగే, జీపీకి ట్రాలీ, డ్రోజర్ వాహనాలున్నాయి. ఎప్పటికప్పుడు వీధుల్లో చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు పంచాయతీ సిబ్బంది తరలిస్తున్నారు. ఇటీవలే గ్రామంలో అట్టహాసంగా గ్రామదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్థానిక సర్పంచ్ ఆలూరి రజిత రూ.10లక్షలతో పోచమ్మ దేవాలయాన్ని నిర్మించారు. గ్రామంలో రిసార్టు, సోలార్ ప్లాంటు ఉండగా నూతనంగా ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ కూడా నెలకొల్పనుంది. గతేడాది వందశాతం పన్నులు వసూలు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు తెలిపారు.

### ఎమ్మెల్యే సహకారంతోనే...

స్థానిక ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ సహకారంతోనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. జెడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవితోపాటు వార్డుసభ్యుల సమన్వయం, గ్రామస్తుల ప్రోత్సాహం వల్లనే అభివద్ధి సాధ్యపడుతుంది. గ్రామంలో మూడు బ్రిడ్జిపనులు, రెండు వాటర్‌ప్లాంటుల నిర్మాణానికి కృషి చేస్తున్నాం. వంగరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. గ్రామంలో సోలార్‌ప్లాంటు, రిసార్ట్ ఉండగా రెండు మైనింగ్ కట్టర్స్ మంజూరయ్యాయి.



– ఆలూరి రజిత, సర్పంచ్



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

## కేశవనగర్ పంచాయతీ కార్యాలయం ప్రారంభం

ధర్మసాగర్, అక్టోబర్ 7 : మండలంలోని కేశవనగర్ గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయాన్ని శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20లక్షలతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం నూతనంగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటికి సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కట్టించిందన్నారు. అనంతరం శ్మశానవాటిను ప్రారంభించారు. గ్రామంలో పలువురికి బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఎంపీడీవో జవహర్ రెడ్డి, ఎంపీవో కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ శోభ, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, అదే గ్రామానికి చెందిన మహ్మద్ ఆలీయా మృతిచెందగా ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్ మునిగాల శోభ, గ్రామస్తులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఏనుగుల మానస

## ఆడబిడ్డలకు పండుగ కానుక

న్యూశాయంపేట, అక్టోబర్ 7 : ఆడబిడ్డలకు ప్రభుత్వం పండుగ కానుకగా బతుకమ్మ చీరెను అందజేసి, అన్ని వర్గాల పర్వదినాలను సమాన దృష్టితో చూస్తున్నదని 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస అన్నారు. శనివారం డివిజన్‌లో మహిళలకు ఆమె బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టలేదన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ పండుగలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకుడు గౌస్‌పాషా

## నేడు మోడల్స్ సెలక్షన్స్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : తెలంగాణ ఫ్యాషన్ వీక్‌లో భాగంగా మోడల్స్ సెలక్షన్స్‌ను ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డు వాటర్‌ట్యాంకు పక్కన గల రోస్ గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గౌస్‌పాషా తెలిపారు. ఈ మేరకు శనివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌస్‌పాషా మాట్లాడుతూ ఉదయం 10 నుంచి 2 గంటల వరకు నిర్వహించే మోడల్స్ ఎంపికల్లో 4 నుంచి 40 ఏళ్ల వయసు వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం సంప్రదాయ వస్త్రాలు ఎక్స్‌ప్లోర్ చేసేలా ఫ్యాషన్ వీక్ ఉంటుదన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 75697 01494 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో తన్జీల్ రషీద్, రితిక్, గణేశ్ పాల్గొన్నారు.

## వెంచర్ పనులు నిలిపివేత

కమలాపూర్, అక్టోబర్ 7 : మండల కేంద్రంలో అక్రమంగా వెంచర్ నిర్మిస్తుండగా దాన్ని నిలిపివేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి శనివారం తెలిపారు. కమలాపూర్ నుంచి దేశరాజ్‌పల్లి గ్రామానికి వెళ్లేదారిలో రోడ్డు పక్కన ఉన్న వెంచర్ చుట్టూ అనుమతి లేకుండా ప్రహరీ చేపడుతున్నారు. రోడ్డుకు ఆనుకుని కందకం తీస్తూ మట్టిని వెంచర్‌లో పోయిస్తుండగా స్థానిక రైతులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వార్డు సభ్యులు మల్లారెడ్డి, అయిలయ్య పాల్గొన్నారు.

## సీపీకి రజక నాయకుల కృతజ్ఞతలు

కాజీపేట, అక్టోబర్ 7 : వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపిన సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్‌కు చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ నార్లగిరి రామలింగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ శనివారం సీపీ కార్యాలయంలో ఆయనను కలువగా సానుకూలంగా స్పందించి, విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పినట్లు తెలిపారు. త్వరలో ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

### ఎంపీపీ తడక రాణి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తడక రాణి

కమలాపూర్, అక్టోబర్ 7: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని ఎంపీపీ తడక రాణి అన్నారు. శనివారం కమలాపూర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో రూ.కోట్లతో అభివృద్ధి పనులను చేశారని, వాటిని ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ రాక ముందు గ్రామాల పరిస్థితి ఎలా ఉండేది? వచ్చాక మారిన స్థితిగతులపై ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలియజేయాలన్నారు. మండలంలో గ్రామాల్లో ఉన్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకుని పరిష్కారం చూపాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిన పనుల బిల్లులు రావడం లేదని, దీంతో అనేక మంది సర్పంచ్‌లు ఆర్థికంగా నష్టపోతున్నట్లు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌ల పదవి కాలం మూడు నెలల్లో ముగియనుండడంతో వెంటనే బిల్లులు ఇప్పించాలని కోరారు. దీంతో బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్‌రావు, ఎంపీడీవో పల్లవి, సూపరింటెండెంట్ రాజేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సమాజంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య

హనుమకొండ, అక్టోబర్ 7 : విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. కళాశాలలోని బీఏ విభాగం(సామాజిక శాస్త్రాల) సీనియర్ విద్యార్థులు శనివారం జూనియర్ విద్యార్థులకు స్వాగతం(వెల్కమ్) సమావేశం నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ సమాజంలో నిత్యం ఎదురవుతున్న సమస్యలను బీఏ విద్యార్థులు గమనించాలన్నారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విప్లవాత్మక మార్పులను గమనించినప్పుడే సమాజ లోటుపాట్లు తెలుస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హన్మంతు మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పుటకు ఈ పరిచయం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక శాస్త్రాల అధ్యాపకులు డాక్టర్ భిక్షపతి, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ చారి, డాక్టర్ సదాశివ్, డాక్టర్ దాస్, డాక్టర్ శేషు, డాక్టర్ హరి కుమార్, డాక్టర్ ఉప్పయ్య, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ పుల్లా రమేశ్, డాక్టర్ సదానందం, డాక్టర్ సంజీవ, డాక్టర్ ఆదిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ దేవేందర్‌రావు

## ఉప్పల్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ

కమలాపూర్, అక్టోబర్ 7 : మండలంలోని ఉప్పల్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు శనివారం భూమి పూజ చేశారు. గ్రామంలో రూ.15లక్షలతో మొండెద్దుల తిరుపతి ఇంటి నుంచి కెంసారపు సారయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం, మిల్కూరి రాధమ్మ ఇంటి నుంచి ఎలిగేటి రామస్వామి ఇంటి వరకు డ్రైనేజీ నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ గేట్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఓదెలు, వార్డు సభ్యులు ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, మేడిపల్లి రమేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జక్కుల రాజు, నాయకులు నవీన్‌కుమార్, ముజీబ్ హుస్సేన్, పైడి, రాంచందర్, తిరుపతి, రాజు, రవి, రాజమౌళి, శ్రీనివాసరావు, స్వామి, సంపత్, రఘు, జితేందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

కాజీపేట, అక్టోబర్ 7 : ప్రస్తుతం వాతావరణలోని మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సూచించారు. సోమిడి పరిధిలోని ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారి డాక్టర్ మధులత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులను పంపిణీ చేశారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపర్‌వైజర్ మల్లేశం, జ్యోతి, ఉషా, ప్రియ, లావణ్య, వినోద, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు హరిత, బొంద్యాల్, సుధాకర్ పాల్గొన్నారు.